# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JANUARY - 2000

# సంక్షిప్త వార్తలు

1999 నవంబరు 26వ తేదీ శుక్రవారం నాడు సోదరులు జాషువా గూటం గారు కలకత్తా వెళ్ళిరి. ఒక దినము కలకత్తా స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో గడిపి మరునాడు ఆయన నేపాల్ దేశ ముఖ్యపట్టణమగు ఖాట్మండు చేరుకొనిరి. నవంబరు 28వ తేదీ ఆదివారం ఉదయం అమెరికా నుండి నేరుగా సోదరులు ఐరా రైస్ గారు ఖాట్మండు చేరుకొనిరి. జాషువాగారు రైస్ గారు ఇరువురు 28, 29, 30 తేదీలలో ఖాట్మండులో బైబిల్ క్లాసులు సువార్తకూటములు జరిపించిరి. 28 వ తేదీ ఆదివారం సోదరులు జాషువాగారు ఖాట్మండులోని మూడు స్థానిక సంఘాలలో వాక్య పరిచర్యగావించగా, రైస్‌గారు మరిరెండు స్థానిక సంఘాలలో వాక్య పరిచర్య గావించిరి. ఖాట్మండులో జరిగిన సువార్త కూటములలో ఐదుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. రైస్‌గారి ఆంగ్ల ప్రసంగములను సోదరులు పరశురామ్ గారు, జాషువాగారి ఆంగ్లప్రసంగములను సోదరులు జేమ్స్ ఉదయగిరి గార్లు నేపాలీ భాషలోనికి తర్జుమా చేసిరి.

డిశంబరు 1,2 తేదీలలో రైస్‌గారు, జాషువాగారు నేపాల్‌లోని మరొక ప్రముఖ పట్టణమగు పోఖరాకు వెళ్ళి అక్కడ బైబిలు క్లాసులు నిర్వహించగా ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. నేపాల్ పర్యటనలో ఆ దేశ వాస్తవ్యులు సోదరులు శేర్ బహదూర్‌కార్కి గారు ఎంతగానో సోదరులకు సహకరించిరి.

డిశంబరు మూడవ తేదీనాడు రైస్‌గారు, జాషువాగారు కలకత్తా మీదుగా హైదరాబాద్ చేరుకొని ఆ రాత్రి అక్కడ గడిపి మరునాడు నిజామాబాద్ చేరుకొనిరి. డిశంబరు 4,5 తేదీలలో నిజామాబాద్ ప్రాంతములో యున్న మూడు స్థానిక సంఘములలో వాక్య పరిచర్యగావించిరి. 4వ తేదీ సాయంత్రం ఆర్మూర్ మండలం ధర్మోరా లోను, 5వ తేదీనాడు ఉదయం డిచ్‌పల్లిలోను, మధ్యాహ్నం నిజామాబాద్ పట్టణంలోను వాక్యపరిచర్య చేసిరి. మొత్తం 13 మంది ఈ మూడు స్థలాలలోను క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. నిజామాబాద్ పట్టణంలోను పరిసర ప్రాంతములలోను సోదరులు యన్. టైటస్ గారు, వారి కుమారుడు ఎబినేజర్ గారు క్రీస్తు కొరకు ఎంతగానో శ్రమించి పనిచేయుచున్నారు. వారు చేయుచున్న పనిని చూచి సోదరులు రైస్‌గారు వారిని అభినందించిరి.

(తరువాయి 3వ కవరు పేజీలో)

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 63722

Editor :

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 20 జనవరి 2000 సంచిక 6


## పురాతన మార్గములు
(The Old Paths)

సత్యవాక్కు చదువరులకు నూతన సహస్రాబ్ది శుభాభివందనములు. మానవ జాతి మరొక సహస్రాబ్దిలో అడుగిడుచున్నది. గత వెయ్యేండ్లలో సాధించిన ప్రగతికంటే వారు గత వంద సంవత్సరాల్లో సాధించిన ప్రగతి గొప్పది. అనేక విషయాల్లో మానవులు మందుకు పోయినను, ఆత్మీయముగా మాత్రం వెనుకబడే యున్నారు. వారి సహజ తత్వంలో మార్పు యేమీ లేదు. ప్రతివాడు తాత్కాలిక ప్రయోజనాలను, సంతోషాన్ని వెదుకుచు నిత్యత్వాన్ని గూర్చిన చింతన లేక యున్నాడు.

అయితే, "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు- మార్గములలో నిలిచి చూడుడి; పురాతన మార్గములను గూర్చి విచారించుడి. మేలు కలుగు మార్గమేది అని యడిగి అందులో నడుచుకొనుడి, అప్పుడు మీకు నెమ్మది కలుగును"

(యిర్మీయా 6:16). మానవులు దేవుడేర్పరచిన పురాతన మార్గములను వీడి తనకిష్టమొచ్చినన్ని మార్గములనెంచుకొని యున్నారు. అయితే మానవకల్పిత మార్గములు పరలోకమునకు చేర్చవు. అందుకే, "యెహోవా తమ మార్గము నిర్ణయించుకొనుట నరుల వశములో లేదనియు,"మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" అని ప్రవక్తయైన యిర్మీయా చెప్పుచున్నాడు(యిర్మీయా 10:23). ఏలయనగా "ఒకని మార్గములో వాని దృష్టికి యధార్థముగా కనబడును, అయినను తుదకు అది మరణమునకు చేరును" (సామె 16:25).

మన ఆత్మీయ యాత్రను సుఖాంతము చేయుటకు దేవుని వాక్యము అత్యవసరం. అందుకే "నీ వాక్యము నా పాదములకు దీపమును, నా త్రోవకు వెలుగునై యున్నది"యని దావీదు చెప్పాడు (కీర్తన 119:105). మరల, "యౌవనస్థులు దేనిచేత తమ నడత శుద్ధి పరచుకొందురు ? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనేగదా ?" యని అతడు వక్కాణించాడు. నేటి క్రైస్తవ్య జీవితంలో దేవుని వాక్యమునకున్న అధికారమును మనము తిరిగి పునరుద్ధరించాలి. మనం మాటచేతగాని, క్రియచేత గాని యేమి చేసినను దానికి దేవుని వాక్యము యొక్క అనుమతిని పొందియుండాలి. "ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్టు బోధించవలెను; ఒకడు ఉపచారము చేసిన యెడల దేవుడనుగ్రహించు సామర్థ్యము కొలది చేయవలెను. ఇందువలన దేవుడు అన్నిటిలోను యేసుక్రీస్తు ద్వారా మహిమ పరచబడును" (1పేతురు 4:11).

దేవుని వాక్యానికి మానవ కల్పిత బోధలకు సమానాధికారము నిచ్చుటవలన మతశాఖలు ఏర్పడ్డాయి. ఆలాగే పారంపర్యాచారముల వలన దేవుని వాక్యము నిరర్థకము చేయబడుచున్నది. "మీరు మీ పారంపర్యాచారము నిమిత్తము దేవుని వాక్యమును నిరర్ధకము చేయుచున్నారు... "ఈ ప్రజలు తన పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా నున్నది; మనుష్యులు

కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని యెషయా చెప్పిన మాట సరియేయని యేసుప్రభువు పలికారు (మత్తయి 15:7-9).

మానవ కల్పిత బోధలవలన, పారంపర్యాచారముల వలన జీవ జలముల బావులు పూడ్చివేయబడ్డాయి. ఇప్పుడు క్రీస్తు సంఘస్థులు ఆ బావులను తిరిగి త్రవ్వాలి. అబ్రాహాము మృతిపొందిన తరువాత ఫిలిష్తీయులు అతడు త్రవ్వించిన బావులను పూడ్చివేసారు. అయితే ఇస్సాకు తన తండ్రియైన అబ్రాహాము దినములలో త్రవ్విన నీళ్ల బావులను తిరిగి త్రవ్వించెను. మరియు అతడు తన తండ్రి వారికి పెట్టిన పేళ్లు పెట్టెను (ఆది.కా. 26:18). సత్యవాక్యమును సరిగ విభజించు వానికి మతశాఖల అబద్ధ బోధలతో నిండిపోయిన బావులు ఎన్నెన్నో గోచరమవుతాయి. ఇస్సాకువలె ఒక్కొక్క అబద్ధ బోధను త్రవ్వి బయట పార వేయాలి. ఇస్సాకు ఫిలిష్తీయుల చెత్త చెదారమును త్రవ్వి పారవేయుటయే గాక ఆయా బావులకు తన తండ్రి పెట్టిన పేళ్లు పెట్టెను. ఇప్పుడు మనం బైబిలు పలుకుచోట పలుకుదాం, బైబిలు మౌనియైన చోట మౌనముగా యుందాం. బైబిలు సంగతులను బైబిలు పేర్లతో పిలుద్దాం. క్రొత్తనిబంధన క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించుదాం.

## క్రైస్తవ్యము మతశాఖ సంబంధమైనది కాదు
### (Christianity is not Denominational)

నీ మతం ఏంటి, అని యే వ్యక్తయినా నన్ను ప్రశ్నిస్తే, నేను క్రైస్తవుడనని అతనికి జవాబిస్తాను. అయితే అతనికి సరైన జవాబీయకుండా తప్పించుకున్నానని అతడు భావిస్తాడు. క్రైస్తవుడు అను పదానికి యీనాడు ఏలాంటి ఉపవర్గాలు లేకుండా ఉండుట కేవలం హాస్యాస్పదంగా తీసికోబడింది. "అవును నీవు క్రైస్తవుడవు అని నాకు తెలుసు, గాని యే రకం క్రైస్తవుడవు ?" అని అలాంటివారు ప్రశ్నిస్తూ

ఉంటారు. "నేను యే రకం క్రైస్తవుడను కాను, గాని క్రొత్తనిబంధన కాలంలో ప్రజలు యేలాంటి క్రైస్తవులో అలాంటి క్రైస్తవుడనే" యని నేను వారికి తిరుగు జవాబిస్తాను. అవును, గాని "ఏ మతశాఖకు చెందావు ?" అని వారు మళ్ళా ప్రశ్నిస్తారు. "నేను యే మతశాఖకు చెందను" అని నేను వారికిచ్చు జవాబై యుండును.

"అదేమి నీవు తప్పకుండా యేదో మతశాఖలో సభ్యుడవై యుండాలి" అని వారంటారు. అయితే నేను వారికిచ్చు జవాబు యిలా వుండును: "నా జీవితములో నేనెప్పుడు యే మతశాఖలోను చేరలేదు. నేను మాత్రం క్రైస్తవుడను-కేవలం ప్రభువు సంఘ సభ్యుడను. రక్షించబడాలంటే ఏం చేయాలో క్రొత్తనిబంధన చెప్పుతుంది. మరియు రక్షించబడిన వారిని ప్రభువు తన సంఘమునకు కలుపును" (అపొ.కా. 2:42) అని కూడ అది చెప్పుతుందని మీరు గమనించండి. నేనెప్పుడు ఏ సంఘములోను చేరలేదు. ఏ మతశాఖలో కూడ నేనెప్పుడు సభ్యుడను కాలేదు. సువార్తకు మాత్రం లోబడ్డాను, కాబట్టి ప్రభువు సంఘమునకు నన్ను చేర్చారు".

అపొస్తలుల కార్యములలో రక్షించబడిన సంఘటనలను చదివిన వ్యక్తి, అదే ప్రకారం యివి క్రొత్త నిబంధన కాలంలో కూడా ఉన్నట్లు గ్రహిస్తాడు. ఆ కాలంలో అవి అలా ఉంటే, యీ కాలంలో కూడ యేదైన ఒక మతశాఖకు చేరినట్లు మనం చదువలేము. మతశాఖల సంగతి క్రొత్తనిబంధన లేఖకులకు తెలియదు. ఆనాడు వారు క్రైస్తవ్యాన్ని ఆచరించినట్లు యీనాడు మనం ఆచరిస్తే, మనం కేవలం క్రైస్తవులమై, క్రొత్తనిబంధన సంఘ సభ్యులుగా యుంటాం, గాని యే ఒక మతశాఖకు చెంది యుండము. దీనిని బట్టి క్రైస్తవ మతం మతశాఖలకు సంబంధించి నట్టిది కాదని అర్థమగుచున్నది.

కొన్ని మతశాఖలు పరస్పర సహవాసం కలిగివుంటే, యే మతశాఖగా ఉండకుండా వుండగలమని కొందరి భావన. సంఘము మతశాఖలన్నిటితో కూడి యున్నదని ఆలాంటి వారి తలంపు. గాని సంఘం సమస్త మతశాఖల నుండి వేరై, ప్రత్యేకంగావుండాలి. దీని సంబంధం మతశాఖలతో పరస్పర సహవాసము

"కలదు" అను మాటతో వివరించుట కంటె, సహవాసము "లేదు" అను మాటతో వివరించవలెను. సమస్త మతశాఖల నుండి ప్రభువు సంఘ సభ్యులు దూరంగా ఉండాలని దీని యర్థం. ఇదే నేడు క్రీస్తు సంఘాలు చేయు విజ్ఞాపన.

ప్రజలు సువార్త విని, విశ్వసించి, వారి పాపాల నుండి మళ్ళిపోయి పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందితే, వారే మతశాఖకు చెందుతారు ? తప్పకుండా ఏ మతశాఖకు చెందరు. వీరు సమాజముగా ఏర్పడి క్రైస్తవులుగా దేవుని ఆరాధించుటకు నిశ్చయించుకుంటే, వారింకనూ యే మతశాఖగా కూడా కాలేదు. వీరే ఒక మతశాఖగా అయితే క్రొత్తనిబంధన కాలంలోని ప్రజలు కూడ మతశాఖస్తులే. అయితే పేతురు, పౌలు మిగిలిన క్రొత్తనిబంధన కాలపు వ్యక్తులు మతశాఖల సభ్యులై యుండిరని యెవరు చెప్పినట్టు నేను వినలేదు. వారు మతశాఖ సభ్యులు కానప్పుడు, మనం వారిని వెంబడిస్తే, మనం కూడ మతశాఖ సభ్యులం కాము.

ఏ మానవుడు మతశాఖల పేరు పెట్టుకోవాలని మా కోరిక కాదు, గాని అతడు క్రైస్తవుడను పేరు మాత్రం పెట్టుకోవాలని మా కోరిక. బైబిలును గాకుండా యితర మానవ నియమావళులను అనుసరించమని మా కోరిక కాదు. మరియు నీవు యేదో నొక మతశాఖలో చేరవలెనని కూడ మేము కోరుటలేదు. కాని నీవు సువార్తకు విధేయుడవై ప్రభువు చేత ఆయన సంఘానికి చేర్చబడవలెనని మాత్రం మా కోరిక. నీవు క్రైస్తవుడుగా ఏమి చేయవలసి యుండెనో అవే నేడును నిన్ను క్రైస్తవునిగా చేయగలవు. క్రొత్తనిబంధన కాలంలో క్రీస్తు సంఘంగా ఉండడానికి ఏమి కావలసియుండెనో అవే నేడును క్రీస్తు సంఘంగా ఉండుటకు కావలసి యున్నవి.

- రేమండ్ కెల్సీ

# కన్యకు జన్మించుట
## (The VIrgin Birth)

మానవజాతి చరిత్ర యంతటిలోను కన్యకు జన్మించుట ఒకే ఒక్కసారి జరిగెను. కొందరికిది కట్టుకథవలె యుండును. గాని యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్ముమవారికి అది యధార్థమైనది. దానిని బట్టి క్రీస్తు నిజమైనవాడు, నిష్కళంకమైనవాడు.

కన్య అనగా పవిత్రమైనది, మచ్చలేనిది, నిర్దోషమైనది; ఆమె పెండ్లి కానట్టియు, లైంగిక సంయోగము నెరుగనట్టియు ఒక యౌవన స్త్రీ. అట్టి స్త్రీ గర్భమును ధరించి ఒక శిశువును కనుట ప్రకృతి సూత్రప్రకారము జరిగేది కాదు. సరిగదా ఆదాము హవ్వలను సృష్టించిన తరువాత సంతానాభి వృద్ధికొరకు స్త్రీ పురుషులు వివాహములో కలియవలెనని దేవుని యేర్పాటై యున్నది. నాటినుండి నేటివరకు ఆ సూత్రము అమలులో యున్నది. చరిత్ర యంతటిలోను అది ఒకే ఒక్క మారు వినాయించబడెను. మానవులెరిగిన వినాయింపు (Exception) అది ఒక్కటే గనుక దానిని అంగీకరించుట గాని తిరస్కరించుట గాని జరుగుచున్నది.

మానవ దృక్పధముతో ఆలోచించిన యెడల సహజముగా కన్యక గర్భమును ధరించులో దోషమును ఒకడు కనుగొనును. అట్టిది అసాధ్యమని నిరూపించుటకు ఆతడు ప్రకృతిని, విజ్ఞాన శాస్త్రమును మరియు ప్రతిదినము జరిగే సంఘటనల అనుభవమును చూపించును. అయితే అట్టివారు దేవునికి సమస్తమును సాధ్యమే అను సంగతిని మరచిపోవుదురు. దేవుడే ఈ విషయములో పూనుకొనెనని గమనించగానే కన్యక గర్భమును ధరించినది వాస్తవమని మనమతి సులువుగా గ్రహించుకొనగలము.

మతసంబంధముగా ఈ బోధను ఎదురాడుట జరిగినది. మన కాల మందున్న Liberals మరియు Modernist లలో ఇది వాస్తవము. క్రొత్త ఇంగ్లీషు

బైబిలు (The New English Bible) లో'కన్య' అను పదము 'యౌవన స్త్రీ' యని మార్చివేయబడెను. కన్యకకును, యౌవన స్త్రీకిని గొప్ప వ్యత్యాసము కలదు. కన్యక యౌవన స్త్రీ కాగలదు గాని యౌవన స్త్రీ కన్య కాకపోవచ్చును. గనుక 'యౌవన స్త్రీ' యను పదమును బైబిలునందు వినియోగింపబడగా దినములు గడచు సరికి కన్యక జన్మించిన సందర్భము చులకన చేయబడును, విసర్జింపబడును.

ఇది ఆరంభము మాత్రమే. క్రీస్తు కన్యకు జన్మించని యెడల ఆయన సామాన్య మానవునికంటె ఏమియు మిన్నయైనవాడు కాదు. మరియు కన్యకు జన్మించిన సంఘటనను తొలగించి చేయబడిన బైబిలు అనువాదములు ఆయన కేవలము మానవ మాత్రుడేయని నిరూపించుటకు చేయబడిన ప్రయత్నములే. ఆయన మానవమాత్రుడే అయినయెడల మరొక మనిషికంటె ఆయన దేవుని కుమారుడు ఎట్లు కాగలడు ? ఆయన దేవుని కుమారుడు కానియెడల మానవజాతి యొక్క రక్షకుడు కాజాలడు. ఇది ఆయన మరణమును, సమాధిని, పునరుత్థానమును, తీర్పును, పరలోకమును, నరకమును, చివరికి బైబిలును, సహితము తిరస్కరించుటకు దారి తీయును.

ఈ ఆరోపణలు, తిరస్కృతులు అన్నియు క్రీస్తును మానవ జాతి స్థాయికి దించుట కొరకు ఉద్దేశింపబడినవి. ఆయన ఒక గొప్ప వ్యక్తి, గొప్ప నాయకుడు, గొప్ప బోధకుడు అని తిరస్కరించుటకు వారు అట్టి సంగతులను చేయరుగాని అటు తరువాత ఉంచబడేది శూన్యము. క్రీస్తును ఆయన బోధలును సాంఘిక సువార్తగను, మంచి నైతిక సూత్రములుగను, అనేకులచే ప్రపంచమందు ప్రకటింపబడిన ఒక జీవన వేదాంతముగను వర్ణించబడుట జరుగుచున్నది.

క్రీస్తు అంతా యింతేనా ? ఆయన కేవలము మానవులను మోసగించిన కృత్రిమ పురుషుడేనా ? ఆయన మానవుని కంటె మిన్నయైన వాడనని చెప్పుకొనినందున, కన్య గర్భమున జన్మించని యెడల ఆయనను గూర్చి మనము ఇంకేమి చెప్పుకొనగలము ? గాని ఆయన కన్య గర్భమున బుట్టెను. ఆయన అట్లు పుట్టునని ప్రవచింపబడెను. యెషయా యిట్లనెను: "కాబట్టి ప్రభువు తానే

యొక సూచన మీకు చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారునికని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును" (యెషయా 7:14). ఆయన జన్మించు స్థలము కూడ ప్రవచింపబడెను (మీకా 5:2). అప్పుడది యిట్లు నెరవేరెను: "యేసుక్రీస్తు జనన విధమెట్లనగా ఆయన తల్లియైన మరియ యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాకమునుపు ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా ఉండెను. ఆమె భర్తయైన యోసేపు నీతిమంతుడై యుండి ఆమెను అవమాన పరచనొల్లక రహస్యముగా ఆమెను విడనాడ ఉద్దేశించెను. అతడు ఈ సంగతులను గూర్చి ఆలోచించుకొనుచుండగా, ఇదిగో ప్రభువు దూత స్వప్నమందు అతనికి ప్రత్యక్షమై-దావీదు కుమారుడవైన యోసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము, ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మ వలన కలిగినది; ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను. ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్త ద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని యర్థము. యోసేపు నిద్ర మేలుకొని ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారము చేసి, తన భార్యను చేర్చుకొని ఆమె కుమారుని కనువరకు ఆమెను ఎరుగకుండెను; అతడు ఆ కుమారునికి యేసు అను పేరు పెట్టెను" (మత్తయి 1:18-25). లూకా 1వ అధ్యాయమును కూడ చదువుము.

ఈ లేఖనములలో క్రీస్తు కన్యకు జన్మించునని ప్రవచింపబడుట, అది నెరవేరుటను మనము చూచితిమి. దేవుడు తండ్రియై యుండెను. మరియ తల్లియై యుండెను. అందువలన భూసంబంధమైన తండ్రి లేకుండ క్రీస్తు జన్మించెను. ఇది ఒక అద్భుతము. దేవుడు తన కుమారుని ఈలోకమును పంపుటకు అట్టి పద్ధతిని ఎన్నుకొనెను. ఆయన స్త్రీ వలన పుట్టి, మనుష్యుల మధ్యను జీవించినందున మనుష్యుల అవసరతలను ఆయన ఎరుగును. దానిని ఎవరు కాదనలేరు (ఫిలిప్పీ 2:5-11; గలతీ 4:4; హెబ్రీ 4:15). ఆయన చేసిన అద్భుతముల వలనను, ఆయన

మరణ సమాధి పునరుత్థానముల వలనను తన దైవత్వాన్ని ఆయన మరింత నిరూపించెను (అపొ.కా. 2:22; 1కొరింథీ 15:1-8).

క్రీస్తు కన్యకు జన్మించెనని అంగీకరించుట, ఆయనకు సంబంధించిన సంగతులన్నిటిని అంగీకరించుటయే. దానిని తిరస్కరించిన యెడల క్రీస్తును చివరికి దేవుని తిరస్కరించిన యట్లగును. ఇది ఒక సామాన్య సంగతి కాదని జ్ఞాపకముంచు కొనవలెను. అది దేవుని శక్తివల్లనే సాధ్యమాయెను. మనము దీనిని అర్ధము చేసుకొననప్పుడు కన్యకు జన్మించిన దానిని అంగీకరించుటలో సమస్య లేమియు ఉండవు. దీనిని బట్టి క్రీస్తు ఒక సామాన్య మానవుడు కాదు గాని ఆయన దేవుని కుమారుడనియు, లోక రక్షకుడనియు మనమెరుగుదుము.

- జె.సి. ఛోట్.

# ఈ యేసు ఎవరు ?

(Who is this Jesus?)

యేసుక్రీస్తు రాబోవుచున్నాడని పాతనిబంధన మనకు చెప్పుచున్నది. ఆయన వచ్చాడని క్రొత్త నిబంధనలోని సువార్తలు బోధించుచున్నాయి. ఆయన మరల రాబోవు చున్నాడని మిగతా క్రొత్తనిబంధన అంతా చెప్పుచున్నది. యేసుప్రభువు ఈ లోకానికి వస్తాడని అనేకమంది ప్రవచించారు. వారిలో ప్రవక్తమైన యెషయా చెప్పిన ప్రవచనాన్ని గమనించుదాము. యెషయా 9:6లో ఈలాగు ప్రవచింప బడినది: "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింప బడెను. ఆయన భుజము మీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు, అధిపతి అని అతనికి పేరు పెట్టబడును".

పై వాక్య భాగములో యేసు ప్రభువు ఆశ్చర్యకరుడగు ఆలోచన కర్త యని పిలువబడ్డాడు. సొలొమోను జ్ఞానమును వినుటకు షేబా దేశపురాణి బహుదూరము నుండి వచ్చింది. సొలొమోను మూడువేల సామెతలు చెప్పాడు, వెయ్యిన్నియయిదు

కీర్తనలు రచించాడు (1రాజులు 4:32). గాని యేసు సొలొమోను కంటే గొప్పవాడు. "విమర్శ సమయమున దక్షిణదేశపు రాణి యీ తరము వారితో నిలువబడి వారి మీద నేరస్థాపన చేయును; ఆమె సొలొమోను జ్ఞానము వినుటకు భూమ్యాంతముల నుండి వచ్చెను; ఇదిగో సొలొమోను కంటె గొప్పవాడు ఇక్కడ ఉన్నాడు" అని యేసు ప్రభువు బోధించారు (మత్త 12:42).

యేసుక్రీస్తు తన జ్ఞానాన్ని మనకియ్యగలడు. "అడుగుడి మీకియ్యబడును. వెదకుడి మీకు దొరకును,తట్టుడి మీకు తీయబడును, అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరకును, తట్టువానికి తీయబడునని" ఆయన బోధించారు (మత్తయి 7:7,8). మరల "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగ దయచేయువాడని" యాకోబు 1:5లో వ్రాయబడియున్నది. ప్రార్థన ద్వారాను, ఆయన వాక్యపఠనము ద్వారాను మనమాయనపై ఆధారపడిన యెడల ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్తయగు యేసుక్రీస్తు మనల్ని తప్పక జ్ఞాన మార్గములో నడిపిస్తారు.

## బలవంతుడైన దేవుడు

యేసు బలవంతుడైన దేవుడని యెషయా ప్రవచించాడు. బెత్లేహేములో శిశువుగా జన్మించినప్పుడే యేసు ఆరంభించలేదు. ఆయన అంతకు ముందు నుండేయున్నారు. "యేసు అబ్రాహాము పుట్టక మునుపే నేను ఉన్నానని" యూదులకు చెప్పారు (యోహా 8:58). ఆయన దేవుడు గనుక అబ్రాహాముకు ముందునుండి, ఆదినుండి యున్నవాడు. "ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవునియొద్ద యుండెను, వాక్యము దేవుడై యుండెను... ఆయనలో జీవముండెను; ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను.. ఆ వాక్యము శరీరధారియై కృపా సత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను. తండ్రివలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" అని యోహాను వ్రాసాడు (యోహాను1:1, 4,17).

మానవుల మధ్య మానవావతారియై నివసింపవచ్చిన దేవుడు యేసుక్రీస్తు. ఆయనకు ప్రకృతి మీద శక్తియుండెను. ఆయన సముద్రము మీద నడిచారు (యోహా 6:15-21), నీళ్లను ద్రాక్షారసముగ మార్చారు (యోహాను 2:1-11), గాలిని సముద్రమును గద్దించి తుఫానును నిమ్మళించారు (మత్తయి 8:23-27). మానవులకు సంభవించే రోగాలపై ఆయన శక్తి కలిగియుండెను. కుంటివారిని, గ్రుడ్డివారిని, కుష్ఠురోగులను ఆయన ముట్టి బాగుచేసారు (మత్త 9:27-31; లూకా 5:12-14; మార్కు 7:31-37). అపవిత్రాత్మలను, దయ్యములను ఆయన వెళ్లగొట్టారు (మార్కు 1:32-34,39; మత్తయి 4:25). చనిపోయిన వారిని లేవదీసి మరణముపై ఆయనకు గల శక్తిని నిరూపించారు (లూకా 7:11-18; 8:40-42; 49-56; యోహాను 11అధ్యా). ఆయన తానే చనిపోయి సమాధి చేయబడి మూడవ దినమున సజీవుడై తిరిగి లేచి; మరింత ఘనముగా మరణముపై ఆయనకుగల శక్తిని నిరూపించారు (మత్తయి 28; మార్కు 16; లూకా 24; యోహాను 20). ఆయన మరల వచ్చినప్పుడు మానవులందరిని లేపుదునని వాగ్దానం చేసారు (1కొరింథీ 15). నిశ్చయముగా యేసుక్రీస్తు బలవంతుడైన దేవుడు.

## నిత్యుడగు తండ్రి

మరల, యెషయా 9లో యేసు నిత్యుడగు తండ్రియని పిలువబడ్డాడు. తండ్రి అంటే సంరక్షించువాడు, పోషించువాడని యర్థం. పాత నిబంధనలో భక్తుడైన యోబు పేదలకు సహాయార్థంగా తన సంపదను వినియోగించాడు. గనుక అతడు దరిద్రులకు తండ్రియని పిలువబడ్డాడు (యోబు 29:16). యోసేపు ఫరోకు తండ్రియని పిలువబడ్డాడు. ఈ రెండు సందర్భాల్లోను తండ్రియను పదము సంరక్షించువాడు, పోషించువాడనే భావంతో వినియోగింపబడినది. యేసుక్రీస్తు మనలను ప్రేమించుచున్నాడు. తండ్రి తన బిడ్డల నెట్లు సంరక్షించి పోషించునో అట్లే ఆయన మనకును చేయుచున్నాడు. ఆయన జాలిగలవాడు, కనికర హృదయుడు. "తండ్రి తన కుమారుల యెడల జాలిపడునట్లు, యెహోవా తన యందు భయభక్తులు గలవారి యెడల జాలిపడునని" వ్రాయబడి యున్నది (కీర్తన 103:13). "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా

యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను గనుక మీ మీద నా కాడి ఎత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములను విశ్రాంతి దొరకును" అని యేసుప్రభువు మనలను పిలుచున్నారు (మత్తయి 11:28,29).

యేసుక్రీస్తు సమాధాన కర్తయగు అధిపతి యని యెషయా ప్రవచించాడు. యేసుక్రీస్తు ఈ భూమి మీద ఉద్భవించగా, "సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు, ఆయన కిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానమును కలుగు గాక యని" దూతలు స్తోత్రములు చేసారు (లూకా 2:14). యేసు మానవులకు దేవుని మధ్య సమాధానమును నెలకొల్పడానికి వచ్చాడు. "కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందము" అని రోమా 5:1లో అపొ.పౌలు చెప్పుచున్నాడు. "మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తు యేసునందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు. ఆయన మన సమాధానమై యుండి, మీకును మాకును ఉండిన ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును తన శరీరమందు కొట్టివేయుట చేత మధ్యగోడను పడగొట్టి మన ఉభయులను ఏకము చేసెను.. తన సిలువ వలన ఆ ద్వేషమును సంహరించి దాని ద్వారా వీరిద్దరిని ఏక శరీరముగా చేసి దేవునితో సమాధాన పరచవలెనని యీలాగు చేసెను. గనుక ఆయన మనకు సమాధానకారకుడై యున్నాడని" పౌలు ఎఫెసులోని క్రైస్తవులకు ఉద్బోధించాడు (ఎఫెసీ 2:14-16).

మనము మన ప్రభువైన దేవుని పూర్ణహృదయముతోను, పూర్ణమనస్సుతోను, పూర్ణభక్తితోను, పూర్ణవివేకముతోను ప్రేమించినప్పుడు మనకు గొప్ప సమాధానము లభించును (లూకా 10:27).

యేసుక్రీస్తు ఎవరు ? మనకు జ్ఞానము నిచ్చు ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త పాపక్షమాపణను నిత్యజీవాన్ని ఇచ్చు బలవంతుడైన దేవుడు. మనలను ప్రేమించి సంరక్షించి పోషించు నిత్యుడగు తండ్రి. యేసు మానవులతో మానవులకు.

మానవులకు దేవునికి సమాధానకర్తయగు అధిపతి. ఈ గొప్ప దేవుని సేవించి ఆరాధించడం మన విధి.

యేసుక్రీస్తునందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, ఆయనే దేవుని కుమారుడనీ నోటితో ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుము. నీ నిత్యరక్షణకు ఆయనే కారకుడు (హెబ్రీ 5:9).

- జాషువా గూటం.

# రక్తముయొక్క ప్రాముఖ్యత
## (The Importance of Blood)

దేవుడు ప్రేమామయుడైన దేవుడై యున్నాడు. ఆయన ఆజ్ఞలకు అందరు లోబడవలెను. మన ప్రభువైన యేసు ఆయన తండ్రికి లోబడెను. గనుక మనము క్రీస్తునకు లోబడవలెను. "నేను నా తండ్రి ఆజ్ఞలు గైకొని ఆయన ప్రేమయందు నిలిచియున్న ప్రకారము మీరును నా ఆజ్ఞలు గైకొనిన యెడల నా ప్రేమయందు నిలిచియుందురు" (యోహాను 15:10). పరిశుద్ధ బైబిలు గ్రంథము ఆత్మావేశము వలన వ్రాయబడినది గనుక దేవుని యొక్క చిత్తము మనకు తెలియును. క్రొత్తనిబంధన మాట్లాడుచున్నట్లయితే క్రీస్తు మాట్లాడినట్లే. మనమందరము విని లోబడవలసినదే. వెలిచూపువలన కాక విశ్వాసము వలననే నడుచుకొనుచున్నాము (2కొరింథీ 5:6). విశ్వాసము, బైబిలు ఒకదానితో నొకటి ముడివడియున్నవి. అవి వేరు కాబడవు: వినుట వలన విశ్వాసము కలుగును; క్రీస్తును గూర్చిన మాట వినుట వలన కలుగను (రోమా 10:17).

## రక్తమును గూర్చి బైబిలు యేమి చెప్పుచున్నది ?

రక్తము ప్రాముఖ్యమైనదా ? దేవునికి యెల్లప్పుడు రక్తము ప్రాముఖ్యముగానే యున్నది. క్రైస్తవులు మానవ రక్తమును చిందింపకూడదు:"నరహత్య చేయవద్దు" (మత్తయి 5:21). పాతనిబంధన చట్టము క్రింద దేవునికి హోమముగా రక్తము

అర్పింపబడెను : "యెహోవా సన్నిధిని కోడెను వధింపవలెను. ఆకోడె రక్తము తీసకొని బలిపీఠపుటడుగున పోయవలెను" (నిర్గమ 29:11,12). దేవుడు అన్ని యుగములలో రక్తపు అర్పణలను ఆజ్ఞాపించినను, జంతువుల రక్తము పాపమును తీసివేయలేక పోయెను (హెబ్రీ 10:4).

## రక్తము నందు ప్రాణమున్నదా ?

రక్తము దేహమునకు ప్రాణమని బైబిలులో దేవుడు చెప్పుచున్నాడు : "రక్తము దేహమునకు ప్రాణము" (లేవీ 17:11). రక్తము దేహమునకు ప్రాణము (ఆది. 9:4). దేవునికిని రక్తముకు చాలా దగ్గర సంబంధమున్నది.

## మన రక్షణకు, రక్తమునకు ఏమైనా సంబంధమున్నదా ?

క్రొత్త నిబంధన ఇట్లు బోధించుచున్నది : "ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1యోహాను 1:7). క్రీస్తు శరీరమైన సంఘములో ఆయన రక్తమున్నది (అపొ.కా. 20:28). రక్షింపబడిన వారందరు తమ పాపమును కడిగివేసుకొనుట కొరకు క్రీస్తు సంఘమునందు యేసును సేవింపవలెను. క్రీస్తు యొక్క రక్తములో మన పాపములన్నియు కడిగివేయబడినవి. "మనలను ప్రేమించుచు తన రక్తమువలన మన పాపముల నుండి మనలను విడిపించిన వారికి..." (ప్రకటన 1:6). మన రక్షణ విషయములో జంతువుల రక్తమునకు ఏలాటి సంబంధము లేదు కాని క్రీస్తు యొక్క రక్తములో సమస్తము ఇమిడి యున్నదని లేఖనములు బోధించుచున్నవి : క్రీస్తు యొక్క రక్తము చిందింప బడకుండ పాప విముక్తి లేదు (హెబ్రీ 9:22). ఒకడు తన పాపమును సాధ్యమైనంత వేగిరముగా కడిగివేసుకొనవలెను : "నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసుకొనుము" (అపొ.కా. 22:16). బైబిలు బాప్తిస్మములో రక్తము (క్రీస్తుపాత్ర)

మరియు నీళ్లు (మానవుని పాత్ర) ఇమిడి యున్నవి (యోహాను 19:34; 1యోహాను 5:6-8; 1పేతురు 3:21). "ఇదిగో నీళ్లు" (అపొ.కా. 8:36). క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు (గలతీ 3:27). ఇది విశ్వాసము వలన జరుగును (గలతీ 3:27). ఒకడు బాప్తిస్మము వలన క్రీస్తును ధరించుకొన్నట్లయితే క్రీస్తు యొక్క రక్షించు రక్తములోనికి వచ్చినట్లే.

## రక్తమును తినుటగాని, త్రాగుటగాని తప్పా ?

ఇహలోక సంబంధులకు యెటువంటి విధులు లేవు. వారు అపవాది అనుచరులు గనుక వారు రక్తము తినినను, త్రాగినను సాతానుడు పట్టించుకోడు. గాని ఈ విషయమును గూర్చి దేవుని వాక్యములో నిశ్చితమైన ఆజ్ఞలు కలవు: "మీరు రక్తమును మాత్రము తినక దానిని నీళ్ళవలె నేలమీద పారబోయ వలెను" (ద్వితీ 12:16). ఇది పాత నిబంధనలో ఉన్నను దేవుని మనస్సును తెలియ జేయు ఆజ్ఞయే. ఆ ఆజ్ఞకు అవిధేయులైన వారి ఉదాహరణ : "జనులు గొఱ్ఱెలను ఎడ్లను పెయ్యలను తీసికొని నేలమీద వాటిని వధించి రక్తముతోనే భక్షించినందున జనులు రక్తముతోనే తిని యెహోవా దృష్టికి పాపము చేసిరి" (1సమూ14:32,33). అనాది కాలము నుండియు దేవుడు రక్తము తినుటను నిషేధించెను. చాలామంది అన్యులు శత్రువుల పుర్రెలను గిన్నెలుగా జేసికొని వాటిలో వారి రక్తమును త్రాగిరి.

## ఈనాడు క్రొత్త నిబంధన ఏమి ఆజ్ఞాపించుచున్నది ?

ఆహారము కొరకు వధింపబడిన జంతువుల రక్తము భూమిపై చిందింపబడ వలెను. వాటిని గొంతు పిసికి చంపి, వాటి రక్తమును వాటియందే ఉంచకూడదు. వాటిని వధించి, రక్తమును భూమిపై పారబోయవలెను. దానిని యిక ఉపయోగించ రాదు. రక్తముతో ఎటువంటి ఆహారము తయారుచేసినను అది పాపమే. విశ్వాసము వలన నడుచుకొనువారు, దేవుడీయాజ్ఞ నెందుకు యిచ్చెనని ప్రశ్నించరు గాని దానికి లోబడుదురు. రక్తమును భక్షించుట గూర్చి క్రొత్తనిబంధనలో క్రైస్తవులకున్న వాక్యములు : 1. విగ్రహ సంబంధమైన అపవిత్రతను, 2 జారత్వమును, 3. గొంతు

పిసికి చంపిన దానిని, 4. రక్తమును విసర్జించవలెను (అపొ.15:20, 28, 29; 21:25).

యేసుక్రీస్తు తన్ను తానే అర్పించుకొని, నీకొరకును, నాకొరకును ఆయన ప్రశస్తమైన రక్తమును సిలువపై చిందించెను. ఆయన యొక్క రక్తము క్రైస్తవులను విమోచించి, నీతిమంతులుగా తీర్చుచున్నది.

"ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత్త నుండి రక్షింపబడుదుము" (రోమా 5:9). "దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ 1:7).

## క్రైస్తవులు కానివారు ఏమి చేయవలెను ?

1. క్రీస్తు వాక్యమును వినవలెను (రోమా 10:17).
2. క్రీస్తు వాక్యమును నమ్మవలెను (యోహాను 8:24).
3. క్రీస్తు చెప్పినట్లు మారుమనస్సు నొందవలెను (లూకా 24:47).
4. క్రీస్తు యొక్క నామమును ఒప్పుకొనవలెను (రోమా 10:10).
5. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను. (మార్కు 16:16).
6. దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను (యోహాను 4:4).

ప్రియుడా ! నీవు క్రైస్తవుడవా ? కానట్లయితే, క్రైస్తవుడవై లేఖనానుసారముగా దేవుని ఆరాధించుము.

- C.G. ఏనిస్

17.

# "నేడు అమలులో యున్న చట్టము యేది " క్రైస్తవులు పాతనిబంధనకు బద్ధులై యున్నారా ?"

నేటికి ప్రపంచములో 600 కోట్లకు పైగా ప్రజలున్నారు. వీరిలో 5000 లకు పైగా శాఖోపశాఖలుగా చీలిపోయి "మేమూ క్రైస్తవులమే" అనుకుంటూ, దేవుని ఆరాధిస్తున్నామని భ్రమపడుతూ వున్న ఈ కాలంలో ప్రతివారు ఆలోచింపవలసిన అంశము యిది. బైబిలు గ్రంధములో ఎన్ని చట్టములు ఉన్నాయి ? ఏ చట్టము క్రింద "క్రైస్తవులు" ఉండవలసిన అవసరత ఉన్నదో పరిశీలింతము.

## చట్టము అనగా నేమి ?

చట్టము అనగా ఆజ్ఞలు నిబంధనలు ప్రజలు ప్రభుత్వము ప్రతిపాదింపబడిన చట్టమునకు ఏ విధంగా లోబడి యుండాలో తెలియజెప్పే షరతులు, ఆజ్ఞలతో కూడినదే చట్టము. దానిని మీరినవాడు శిక్షింపబడుట కూడా జరుగును. వీటిలో 1. భౌతిక పరమైన చట్టము 2. ప్రకృతి చట్టము 3. దైవిక చట్టము కలవు.

1. భౌతిక పరమైన చట్టము : అనగా ప్రభుత్వము, ప్రజలు పరిపాలింపబడుటకు రూపొందించుకొనే చట్టము. దీనికి పరిమితి కలదు. ప్రతి దేశానికి ఒకొక్క చట్టము కలదు. ఆ ప్రజలు వారి వారి దేశ చట్టములకు లోబడియుండ వలెను. అలాగాకుండ ఒక దేశంలోని వ్యక్తి, మరొక దేశంలో చట్ట ప్రకారం జీవించుట అంగీకరింపబడదు.

A. అరాచకత్వం (Anarchy) : మంచి, చెడు విచక్షణ మరచి, జనులు విచ్చల విడిగాకట్టులేక తిరుగుట; నాయకులు రాజులు లేని పరిస్థితి. దీనిని గూర్చి న్యాయాధిపతులు 17:6, 21:25లో చదువగలము.

B. ఏక రాజ్యాధిపత్యం (Monarchy) : రాజు చెప్పేదే చట్టం. మార్పులు చేర్పులు అతని ఆధీనంలోనే ఉంటాయి. సవరింపులుకు సమావేశాలు ఉండవు. దీని గూర్చి ఇశ్రాయేలీయుల రాజుల కాలంలో చూడవచ్చును. వీరు దేవుని ద్వారా

యివ్వబడిన చట్టమునకు అనుగుణంగా పరిపాలన చేయాలి.

C. ప్రజాపాలన (Democracy): ప్రజాప్రభుత్వం. దీనిలో ఉండే చట్టం అవసరమైతే సవరింపులు, సమావేశాలు ఉంటాయి. యిది నేటి భారతదేశంలో చూడగలం.

ఈ మూడింటిలో ఏది క్రైస్తవ్యము నకు అనుకూలమైనదో పరిశీలించవలెను. అరాచకం అయితే ఎవరియిష్టాను సారంగా వారు క్రైస్తవ్యంలో కొనసాగుటకు అవకాశం లేదు. ఏకరాజ్యాధిపత్యంలో ఈయన చేసేదే చట్టం. యిదే ఆత్మీయముగా క్రైస్తవ్యమునకు అనువైనది. దీని గూర్చి తరువాత పరిశీలన చేద్దాము.

ప్రజాపాలన అయితే క్రైస్వవ్యంలో మాటిమాటికీ సవరింపులు అంగీకరింప బడవు. ఈనాటి మతశాఖల వైఖరి యిదే. ఎవరి యిష్టాను సారంగా వారు తమకు అనువైన విధానాల ద్వారా మార్పులు చేర్పులు చేసికొంటున్నారు. నిజ క్రైస్తవ్యములో దీనికి తావులేదు (మత్తయి 20:25).

2. ప్రకృతి చట్టము : భూమ్యాకాశములను అందలి సమస్తమును సృజించినప్పుడే ప్రకృతికి చట్టము రూపొందించాడు సృష్టికర్త. సూర్యుడు, చంద్రుడు, వెలుగిచ్చుటకై, తమ గమ్యంలో సాగిపోవుటకు (ఆది 1:16,17) జలసరిహద్దులు (సామెతలు 8:28,29) ఏర్పాటు చేశాడు. వాతావరణం విషయంలో వేసవి, వర్ష, శీత కాలములుగా విభజించాడు (ఆది 8:22). యింకా అనేకమైన వాటితో దేవుడు ప్రకృతి చట్టం యిచ్చాడు.

అయితే ప్రజలు దైవిక చట్టమునకు, దేవునికి లోబడకుండ ఉన్నప్పుడు, ప్రకృతిలో మార్పులు చేసి, వారిని నిర్మూలించాడు. దీని గూర్చి ఎక్కువ వివరించడం లేదు. ఉదా :- ఆయనను ఆరాధించకుండ ఎవరి యిష్టానుసారంగా వారు ప్రకృతిలో రాయి, చెట్టును పూజించినప్పుడు ప్రజలు నాశనమైనారు. నేటికి అలా జరుగుచునే యున్నది (ఉదా :- ఒరిస్సాలో విపరీతమైన విగ్రహారాధన, ప్రజలలో హింసాకాండ, భక్తిగలవారిని హింసించుట, చంపుట). దేవుడు విగ్రహారాధనను ఏకాలంలోను

సహించలేదు. కాబట్టి దేవుడు చూస్తూ ఊరుకొనలేదు. ప్రకృతి చట్టం ద్వారాఉగ్రత వచ్చి, తుఫాను ద్వారా కొన్నివేల మంది హతమైనారు. ఇది నీవు నమ్మగలవా ?

3. దైవిక చట్టము : అనగా దేవుని ఆజ్ఞల ద్వారా ప్రజలు జీవించుట; అనగా దైవిక పరిపాలన. దీనినే 'Theocracy' అంటారు. థియోక్రసీ అనగా దేవుడు రాజుగా నుండి పాలించు రాజ్యం. సృష్టి ఆదినుండి ఈ 'రాజు' (చక్రవర్తి) కొన్ని చట్టములను ప్రతిపాదించాడు. ఏ కాలములో ప్రజలకు ఎలాంటి చట్టాలను యిచ్చాడో చూద్దాము.

A. ఆదామునకు తనకు సంబంధం కలిగి ఉండాలంటే "తినవద్దు" అను ఆజ్ఞ ద్వారా చట్టం యిచ్చాడు (ఆది. 2:16-17). ఆదాము ఆ ఆజ్ఞ మీరుట ద్వారా శిక్ష అమలులోనికి వచ్చినది.

B. నోవహుతో చట్టము :- తన ప్రజలుగా ఉండాలంటే ఓడను సిద్ధం చేసుకొని, దానిలో ప్రవేశించాలి. నోవహు కుటుంబము మాత్రమే ఆ చట్టమునకు లోబడి జల ప్రళయం నుండి కాపాడబడినారు.

C. అబ్రాహాంతో 'సున్నతి' చట్టము స్థాపించాడు. ఈతడు విశ్వాసమును బట్టి "విశ్వాసులకు తండ్రి" గాను దేవునికి స్నేహితుడుగాను పేరుపొందెను.

D. ఇశ్రాయేలీయులతో, మోషే ద్వారా వ్రాత రూపకమైన చట్టమును యిచ్చాడు:- దీనినే ధర్మశాస్త్రం అన్నారు. ఈ ధర్మశాస్త్రంలోవారు ఏ విధంగా నడవాలో, ఏమి చేయాలో, చేయకూడదో, ఏది మాట్లాడాలో, మాట్లాడకూడదో కూడ ఆజ్ఞాపించాడు. దానిలో ఏ ఒక్కడు నిలువలేదు.

E. క్రీస్తు ద్వారా క్రైస్తవులకు క్రొత్తనిబంధన చట్టము :- దీనినే నూతన ధర్మశాస్త్రం అనవచ్చును.యిక్కడ ఒక విషయం గమనించాలి: అదేమనగా ఎఫెసీ 1:3-7 దేవుడు క్రీస్తులో క్రీస్తు ద్వారా తనకు కుమారులు కోరినాడు. కాబట్టి క్రీస్తు వచ్చేంత వరకు, ఆయన తన చట్టములను మార్చుకుంటూ వచ్చి, క్రీస్తు వచ్చిన తరువాత, క్రొత్తనిబంధనను శాశ్వత చట్టముగా యిచ్చినాడు.

అయితే నేడు అమలులో ఉన్న చట్టమును గూర్చి ఆలోచిస్తే, అది 'క్రొత్త నిబంధన' మాత్రమే. ఏలాగనిన, ఆదాము, నోవహు, అబ్రహాములతో చేసిన నిబంధనలకు, క్రైస్తవులు ఏవిధంగా లోబడవలసిన అవసరం లేదో, ఇశ్రాయేలీయులకు వ్రాత రూపకమైన విధి, ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమునకు కూడ క్రైస్తవులుబద్ధులై యుండవలసిన పనిలేదు. వీటి మహిమను పితరులతో ఉన్న చట్టం నక్షత్రకాంతి గాను, ఇశ్రాయేలీయుతో నున్నది చంద్రకాంతి గాను, క్రైస్తవులతో నున్న చట్టం సూర్యకాంతితోను పోల్చవచ్చును. కాబట్టి ఈ సంపూర్ణ నియమం ద్వారానే తండ్రి యొద్దకు చేరగలం.

అయితేపాతనిబంధన కూడ క్రైస్తవులు ఆచరించాలి అనిన ఎడల, కొన్ని విషయాలు పరిశీలించాలి.

పాతనిబంధన, క్రొత్తనిబంధనల తారతమ్యమును 2కొరింథీ 3,4 అధ్యాయములలో చూడగలం. అయితే పాతనిబంధన చట్టమును ఎవడును నేరవేర్చలేదు గాబట్టి యేసుక్రీస్తు వచ్చి దానిని తన జీవితంలో నెరవేర్చుచూ, క్రొత్తనిబంధనను ప్రవేశపెట్టినాడు (హెబ్రీ 7:18-19). అదే అధికమైన నీతి (మత్తయి 5:20). ఎలాగనిన మత్తయి 5:21 చదివిన ఎడల పూర్వీకులతో చెప్పబడినది నరహత్య చేయవద్దు అనేమాట. కానీ "నేను మీతో చెప్పునదేమనగా" అని మార్పు చేస్తు, పగ, ద్వేషం, కోపం అనేదే రాకుండ ఉండునట్లు వాటి విషయమై 'క్రొత్త ఆజ్ఞ' ప్రవేశ పెడ్తున్నాడు.

ఆలాగే అన్ని ఆజ్ఞల విషయములలో నూతనమైన ఆజ్ఞలు ప్రవేశపెట్టినాడు. విశ్రాంతి దినమును సహితం మార్చి వేయుటకు, ఆదివారమున తిరిగి లేచి, దానికి కూడ ప్రభువునే అని నిరూపించుకొనినాడు. క్రొత్తఆజ్ఞగా ఆదివారం ఆరాధన ప్రతిపాదించాడు.

కాబట్టి క్రైస్తవుడు క్రొత్తనిబంధనకు బద్ధుడు గానీ పాతనిబంధనకు కాదు. పాతనిబంధనను క్రీస్తు తన యొక్క జీవితంలో నెరవేర్చి (లూకా 24:44), సిలువలో కొట్టివేయుట (కొలస్స 2:13-15) ద్వారా ఎత్తివేసినాడు. అనగా దాని ఆజ్ఞలను

పాటించనవసంర లేదు. రోమా 3:31 అలాగని ధర్మశాస్త్రం నిరర్ధకం చేయుట లేదు. గానీ, దానిని చదివి బుద్ధి కలిగి అలాగు చేయకుండ, అలా ఆజ్ఞలను మీర గూడదని దానిని స్థిరపరచుచూ, నూతనమైన దానిలో కొనసాగుచున్నాము.

ఇశ్రాయేలీయుల కివ్వబడినది ఒక "చారిత్రాత్మకమైన ఆధారముగా" నుండుటకు మాత్రమే లిఖించబడియున్నది. క్రీస్తు వచ్చువరకు గతకాల చరిత్రను తెలుపుచున్నది (1కొరింథీ 10:11; గలతీ 3:24). కాని పాతనిబంధన క్రింద ఉండాలి, ఉన్నాము అని ప్రస్తుతం అనేవారు క్రైస్తవులు కాదు-అవిశ్వాసులు మాత్రమే (2కొరింథీ 4:4,3:14-15). వారు క్రీస్తులో లేరు (గలతీ 5:1-4).

## ముగింపు

నేడు అమలులో ఉన్న చట్టము క్రొత్తనిబంధన మాత్రమే. క్రైస్తవులు పాతనిబంధనకు బద్ధులై యుండవలసిన పనిలేదు. "క్రీస్తులో, క్రీస్తు ద్వారా కుమారులుగా స్వీకరింపబడునట్లు" క్రీస్తు వచ్చువరకు గతకాల చరిత్ర కొనసాగింప బడినది. క్రీస్తు వచ్చుట ద్వారా కృప, సత్యము కలిసికొని ఆయన అనుగ్రహించిన సత్యము ద్వారా (చట్టము) కృపలో వున్నాము. అలా వున్న వారే క్రైస్తవులు. దేవుని రాజ్య వారసులు.

- యన్. వినోదరావ్, ఈదర.

# దేవుని బిడ్డలు ధూమ్రపానము చేయవచ్చునా ?

(Can a Child of God smoke Cigarettes ? )

సిగరెట్లు త్రాగుట నీ ఆరోగ్యమునకు హానికరమా ? సిగరెట్లు తయారు చేయువారు 'సిగరెట్లు త్రాగుట వలన నీ ఆరోగ్యమునకు హాని కలుగును' అని ప్రజలకు చట్టప్రకారము హెచ్చరించవలసియున్నారు. దీనిని, ఇట్టి మరికొన్ని హెచ్చరికలను మనము నిర్లక్ష్యపెట్టగలమా ? ఆత్మహత్య పాపమా ? పొగత్రాగుట ద్వారా నెమ్మదిగా ఆత్మహత్య చేసికొనుట పాపమా ? మనలను మనము నాశనము చేసికొని చనిపోయిన తరువాత పరలోకమునకు వెళ్ళగలమా ?

22.

## నీ శరీరము

క్రైస్తవుని శరీరము పరిశుద్ధాత్ముని ఆలయమై యున్నది (1కొరింథీ 6:19). మన శరీరముల ద్వారా దేవుని మనము మహిమ పరచవలెను (1కొరింథీ 6:20). పొగాకుకు అలవాటు పడి మము దేవుని మహిమ పరచగలమా ? అది శరీరమును మాలిన్య పరచునదియే గదా ?

## నీ ప్రభావము

మన ప్రభువుయొక్క సంఘమే దేవుని మందిరము (1తిమో 3:15). దేవుని ప్రజలే దేవుని మందిరమై యున్నారు. వారొక భౌతిక భవనము కాదు గాని వారు కూడుకొను స్థలము (గుడి) ఆరాధనతో ఒక ప్రత్యేక సంబంధమును కలిగి యున్నది. మనము దేవుని ఆరాధించు ప్రదేశములో పొగత్రాగి లోకుల యెదుట సంఘమును అవమానపరచెదమా ? అనేక చోట్ల 'ఇచ్చట పొగత్రాగరాదు' అనే నోటీసులు మనకు కన్పించుచూ యుండును. మన ఆరాధన స్థలముల యొద్దకూడ అట్టి నోటీసులు అతికించుట అవుసరమా ?

## నీ శ్వాసము

నశించిపోవుచున్న ఆత్మలకు సువార్తను బోధించుటకు క్రైస్తవుని స్వరమును క్రీస్తు వినియోగించగోరుచున్నాడు. మనము పుగాకును అలవాటుపడి మన శ్వాసమును (breath) కలుషితము చేయుదుమా ? పొగత్రాగు సువార్తికుడు నాకేమి బోధించగలడు ?' అని చుట్టలకు అలవాటు పడిన బోధకుని గూర్చి మనము తలంచుట సహజము.

తలిదండ్రులు, ఇంటిలో యున్న పెద్దవారు లేక సంఘములో నాయకులుగా యున్నవారు పొగత్రాగుట కలవాటు పడిన వారైన యెడల వారినుండి చిన్నపిల్లలు ఆ యలవాటును ఇట్టే అనుకరించెదరు. నడిపింపు కొరకు మనపై ఆధారపడియున్న వారి యెదుట అట్టి మాదిరిని మనము చూపించగలమా ? నీవు పొగత్రాగుట వలన నిన్ను చూచి నేర్చుకొనిన పిల్లవాడెవడైనను భావిలో కేన్సరుతో గాని, గుండెజబ్బుతో గాని బాధపడవచ్చును.

## 23.

## నీ మాదిరి

బహుశ సంఘములో సహోదరుడొకడు ఇక పొగత్రాగనని నిశ్చయించుకొని యుండవచ్చును. అతడా నిర్ణయముపై నిలకడగా యుండగల్గునట్లు నీవతని చుట్టూ పొగత్రాగకుండా యుండగలవా ? అతడు మానివేయాలనుకుంటే మానివేయగలడు. గాని అతని సమక్షములో నీవే పొగత్రాగుచున్న యెడల అది అతనిని శోధించిన యట్లగును. "మాంసము తినుట గాని, ద్రాక్షారసము త్రాగుట గాని నీ సహోదరుని కడ్డము కలుగజేయునది మరేదియు గాని మానివేయుట మంచిది" యని అపొ.పౌలు చెప్పెను (రోమా 14:21).

## నీ బాధ్యత

ఈ సంవత్సరములో లేక వచ్చే సంవత్సరములో లేక పది సంవత్సరములలో నీవు క్రీస్తుకొరకు ఎన్ని ఆత్మలను సంపాదించగలవు ? "రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పనిచేయలేడు" అని యేసు చెప్పెను (యోహాను 9:4). సిగరెట్లు త్రాగుట ద్వారా నీ ఆయుశ్శు మితము చేసికొంటివి గనుక ఎన్ని ఆత్మలు నీ వలన నిత్య నాశనమునకు వెళ్ళియుందురు ?

## నీ ధనము

సిగరెట్లు ఖరీదైనవి. రూపాయికి ఒక పేకేట్ చొప్పున రోజూ ఒక పేకెట్ సిగరెట్లు కాల్చువారికి సంవత్సరానికి 365/- రూపాయలు ఖర్చగును. డబ్బును అట్లు వృధాగా మనము ఖర్చు పెట్టగలమా ? యేసు అయిదు వేలమందికి అద్భుతరీతిగ ఆహారము పెట్టినను 'ఏమియు నష్టపడకుండ మిగిలిన ముక్కలు పోగుచేయుడని తన శిష్యులతో చెప్పెను' (యోహాను 6:21). సిగరెట్లు ఖరీదు మాత్రమే కాకుండా సిగరెట్లు త్రాగువారి అజాగ్రత్త వలన వందలకొలది, లేక వేలకొలది అగ్ని ప్రమాదములు ఎన్ని జరుగుట లేదు ? లక్షల కొలది ఆస్థి ఎంత నష్టము అగుట లేదు ? ఆ ధనమునంతటిని అట్లు మనము వృధా చేయగలమా?

24.

# నీ ఆత్మ

ఈ వ్యాసమును చదువుచున్నవారికి ఒక మాట : నీవు క్రీస్తు సంఘసభ్యుడవయినను కాకపోయినను, నీవు పొగత్రాగువాడవయినను కాకపోయినను, నీకు కేన్సరు గాని గుండెజబ్బుగాని ఉన్నను లేకపోయినను మనందరము అనుకొన్న దానికంటె ముందుగానే మరణించువారము. గనుక మరణమునకు, తీర్పునకు మనము ఇప్పుడే సిద్ధపడవలెను. ఎట్లు సిద్ధపడవలెనో బైబిలు మనకు బోధించుచున్నది :

పరలోకమునకు మార్గము

| | |
|---|---|
| విశ్వాసము : | యోహాను 8:24; హెబ్రీ 11:6 |
| మారుమనస్సు : | లూకా 13:3; అపొ.కా. 8:37 |
| ఒప్పుకోలు : | మత్త 10:32; అపొ.కా. 8:37 |
| బాప్తిస్మము : | మార్కు 16:16; రోమా 6:3 |

బాప్తిస్మము ద్వారా క్రీస్తు మరణములోనికి మనము పాతిపెట్టబడి నూతన జీవితము జీవించుటకు తిరిగి లేపబడినందున (రోమా 6:3,4), క్రీస్తునందున్న ఈ నూతన జీవితమును అంతమువరకు జీవించెదము గాక. ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు (గలతీ 3:27), ప్రభువు అతనిని తన సంఘములో చేర్చును (అపొ.కా. 2:47). ఆయన బండమీద నిర్మించిన సరియైన సంఘమది (మత్తయి 16:18). అది ఒక డినామినేషన్ కాదు. ప్రభువే శిరస్సైయున్న సంఘములో యుంటూ (కొలస్స 1:18), మరణ పర్యంతము నమ్మకముగా యుండుము (ప్రక 2:10). ఆయన నిత్యజీవ కిరీటాన్ని నీకు బహుకరించును. నీవట్లు చేయగలవా? ఇది చాల అత్యవసరము. ఇప్పుడే నీవట్లు చేయగలవా ? ఇదిగో, ఈరోజే రక్షణదినము (2కొరింథీ 6:2).

- H.L. మీక్స్.

డిశంబరు 6వ తేదీ ఉదయం సోదరులు రైస్‌గారు మద్రాసు మీదుగా ఇండోనేషియాకు, జాషువాగారు కాకినాడకు బయలుదేరి తమ గమ్యస్థానములకు సురక్షితముగా చేరుకొనిరి.

1999 డిశంబరు 30వ తేదీ గురువారం నాడు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం గొల్లవాని తిప్ప రోడ్డులో గల క్రీస్తు సంఘ ఆవరణలో సువార్తికుల సదస్సు జరుపుటకు ఏర్పాట్లు జరుగుచున్నవి. అక్కడ సోదరులు సానబోయిన రాయప్పగారు సువార్తకునిగా పనిచేస్తూ ఈ పత్రిక ముద్రించు సరికి సదస్సు సందర్భమైన పనిలో నిమగ్నులై యున్నారు.

నూతన సహస్రాబ్దిలో 2000 సంవత్సరం జనవరి 17 నుండి 21 వరకు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆవరణలో గొప్ప బైబిలు లెక్చర్‌షిప్ జరుగును. ఆ లెక్చర్ షిప్‌లో వాక్యపరిచర్యగావించుటకు అమెరికా నుండి జాన్‌ఫోర్డ్ గారు, బిల్ మెయర్స్ గారు, రోజర్ రైట్‌గారు వచ్చుచున్నారు. మరియు ఢిల్లీ నుండి ప్రసిద్ధ రేడియో ప్రసంగీకులు సన్నీ డేవిడ్ గారు కూడ వచ్చుచున్నారు. సోదరి నేన్సీఫోర్డ్ గారు స్త్రీలకు ప్రత్యేక తరగతులు నిర్వహించెదరు.

2000 సంవత్సరం జనవరి 27వ తేదీ గురువారంనాడు కాకినాడ సత్యవాణి ఆవరణలో నూతన సహస్రాబ్ది యొక్క మొదటి సువార్తికుల సదస్సు జరుగును. దానిలో అమెరికా నుండి వచ్చిన సోదరులు రోయస్ ఫ్రెడరిక్ గారు తదితరులు పాల్గొందురు. ఆంధ్రలోని సువార్తికులందరు ఆహ్వానితులే. మరియు ఆ రోజు స్త్రీలకు కూడ ప్రత్యేక కూటమును సోదరి సుజీ ఫ్రెడరిక్ గారు ఆమె బృందము జరిపింతురు. గాన సువార్తికులు తమ సతీమణులతో సహా ఆహ్వానించబడుచున్నారు.

1999 వ సంవత్సరాంతమునకు సత్యవాణి రేడియో కార్యక్రమములు ప్రారంభమై 23 సంవత్సరములు ముగిసెను. తత్ఫలితముగా పదిలక్షలకుపైగా బైబిలు కరస్పాండెన్స్ కోర్సులో ప్రజలు చేరియున్నారు. ఇంచుమించు రెండు లక్షల సత్యవాణి రేడియో ప్రసంగముల ప్రతులు ముద్రితమై శ్రోతలకు అందజేయబడెను. సత్యవాక్కు మాసపత్రిక పదివేల గృహాలను దర్శించుచున్నది. ఈ గొప్ప పని మరింత జయకరముగాను, క్రీస్తుకు మహిమకరముగాను జరుగునట్లు ప్రార్థించమనవి.



*Wishing all our readers a very Happy New Year*

**- Editor, Satya Vakku**

RNI Regd. No. 69973/98

Postal Regd. No. VM/KD/02/99

From :

**SATYA VAKKU**

P.O. BOX 80,

KAKINADA - 533 001.

To

*Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam*